

నూతన తరగతి గదులకు ప్రతిపాదనలు



పరిశీలిస్తున్న సురేష్‌కుమార్

పొందూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నూతన తరగతి గదుల మంజూరుకు ప్రతిపాదనలు చేయనున్నట్లు డివిఇఒ వై.సురేష్‌కుమార్ అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాలలో శిథిలావస్థకు చేరుకున్న తరగతి గదులతో పాటు పలు భవనాలను పరిశీలించి, నూతన తరగతి గదుల మంజూరు చేసేలా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు తెలిపారు. శిథిలావస్థకు చేరుకున్న భవనాల్లో తరగతులు నిర్వహించరాదని, పాడైన గదులను వెంటనే ఖాళీ చేసి ఇతర భవనాల్లోకి తరలించాలని ప్రిన్సిపాల్ టి.ఇందిరకు సూచించారు. కళాశాలలో ప్రవేశాలను పెంపొందించాలని, అందుకనుగుణంగా చర్యలు చేపట్టాలన్నారు.

రేషన్ కార్డుల జారీ ఎప్పుడో..?

- కొత్త కార్డులు, ఇతర మార్పుల కోసం వినతుల వెల్లువ
- మొత్తం 58,013 దరఖాస్తులు
- కొత్త బియ్యం కార్డులకు 5,653 మంది అర్హులుగా గుర్తింపు



ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, రాయితీలకు రేషన్ కార్డు తప్పనిసరి అయింది. ఇల్లు, ఇంటి స్థలం మంజూరు వంటి అంశాలకూ కార్డు అవసరమవుతోంది. ఐదేళ్లుగా కొత్తగా రేషన్ కార్డులు మంజూరు చేయలేదు. దీంతో కుటుంబ సభ్యుల చేర్పులు, తొలగింపులతో పాటు చిరునామా మార్పు సవరణలకూ అవకాశం లేకుండా పోయింది. వీటితోపాటు కొత్తగా పెళ్లై, కుటుంబం నుంచి విడిగా ఉంటున్న వారు రేషన్‌కార్డుకు నోచుకోలేకపోయారు. ప్రభుత్వం గత నెల ఏడో తేదీ నుంచి కొత్త రేషన్ కార్డులు, ఇతర అంశాలకు వెబ్‌సైట్‌ను తెరిచింది. దీంతో అధిక సంఖ్యలో దరఖాస్తులు వస్తున్నాయి. జిల్లాలో ఉన్న 732 గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా ఈ ప్రక్రియ సాగుతోంది. రేషన్ కార్డుల జారీ, మార్పులు, చేర్పుల కోసం ప్రభుత్వం అవకాశం కల్పించడంతో ఉద్యోగ, ఉపాధి, వ్యాపారాల కోసం ఇతర ప్రాంతాల్లో నివాసముంటున్న వారు తమ సొంత గ్రామాలకు చేరుకుని దరఖాస్తు చేసుకుంటున్నారు.

పలురకాల సేవలకు 58,013 దరఖాస్తులు

జిల్లాలో ఇప్పటివరకు మొత్తం 58,013 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో సభ్యుల చేరిక కోసమే అధిక సంఖ్యలో దరఖాస్తులు చేరాయి. 42,305 మంది తమ కుటుంబ సభ్యులను కార్డులో చేర్చాలని విన్నవించారు. వాటిలో కొత్త బియ్యం కార్డుల కోసం 6,438 మంది దరఖాస్తు చేసుకున్నారు. బియ్యం కార్డు విభజన కోసం 5,360 దరఖాస్తులు అందాయి. కుటుంబ సభ్యుల తొలగింపు కోసం 1306 మంది దరఖాస్తు చేసుకున్నారు. బియ్యం కార్డులో చిరునామా మార్పు కోసం 1,558 మంది, ఆధార్ అనుసంధానంలో దొర్లిన తప్పిదాలను సరిచేయాలంటూ 960 మంది దరఖాస్తు చేసుకున్నారు. 12 మంది రేషన్ కార్డులు స్వాధీనపరిచేందుకు సమ్మతి తెలిపారు.

5,653 మంది కొత్తగా బియ్యం కార్డులు

సచివాలయాల ద్వారా వచ్చిన దరఖాస్తుల్లో అర్హత ఉన్న వాటిని పరిశీలించి అప్రూవల్ చేస్తున్నారు. మిగిలిన వాటిని తిరస్కరిస్తున్నారు. మొత్తం 58,013 దరఖాస్తుల్లో 26,767 దరఖాస్తులను పరిగణనలోకి తీసుకున్నారు. విఆర్‌ఒలు పరిశీలించి తదుపరి పరిశీలన కోసం తహశీల్దార్లకు పంపుతున్నారు. 7,386 దరఖాస్తులను పరిష్కరించాల్సి ఉంది. అనర్హులు, సరైన పత్రాలు లేకపోవడం వంటి కారణాలతో 23,860 దరఖాస్తులను తిరస్కరించారు. కొత్త బియ్యం కార్డుల కోసం 5,653 మందిని అర్హులుగా గుర్తించారు.

కొత్త కార్డుల జారీ ఎప్పుడో..?

జిల్లావ్యాప్తంగా 1,603 రేషన్ డిపోలు ఉన్నాయి. వాటిలో 1,592 చోట్ల ఈ-పోస్ యంత్రాల ద్వారా సరుకులను పంపిణీ చేస్తున్నారు. మిగిలిన 11 డిపోలు మారుమూల ప్రాంతాల్లో ఉండడం, సిగ్నల్స్ సమస్య కారణంగా ఆ పరిధిలో ఉన్న లబ్ధిదారులకు ఆఫ్‌లైన్‌లో సరుకులు అందిస్తున్నారు. జిల్లాలో 1603 డిపోల పరిధిలో 6,60,739 కార్డులు ఉన్నాయి. వీటిలో 19,39,108 మంది సభ్యులుగా ఉన్నారు. కొత్త కార్డుల జారీ తర్వాత వీటి సంఖ్య మరింత పెరగనుంది. కొత్త బియ్యం కార్డులు, ఇతర మార్పుల కోసం దరఖాస్తు చేసిన వారు ప్రభుత్వం వాటిని ఎప్పుడు మంజూరు చేస్తుందా అని ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. కార్డుల జారీకి ప్రభుత్వం నిర్దిష్ట గడువును విధించకపోవడంతో నెలన్నర రోజులుగా సచివాలయాలకు దరఖాస్తులు వస్తూనే ఉన్నాయి. దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను సాగదీయడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయింది. గత సంవత్సరం కాలంగా అర్హులైన వారు రేషన్‌కు నోచుకోలేకపోయారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వచ్చే నెల నుంచి సరకులు అందేలా చూడాలని అంతా కోరుతున్నారు.

> రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయి. కొత్త బియ్యం కార్డులు, మార్పులు, చేర్పులు, ఇతర సేవల కోసం వేలాది మంది దరఖాస్తు చేసుకుంటున్నారు. అర్హులైన పేదలకు బియ్యం కార్డులు జారీ చేసేందుకు గత నెల ఏడో తేదీ నుంచి ప్రభుత్వం దరఖాస్తుల ప్రక్రియను ప్రారంభించిన విషయం తెలిసిందే. కొత్త కార్డుల్లో కుటుంబ సభ్యుల చేర్పులు, తొలగింపులు, చిరునామా మార్పు, రైస్ కార్డు విభజన, కార్డు సరెండర్, ఆధార్ సరిచేయడం వంటి అంశాలకూ అవకాశం కల్పించడంతో సచివాలయాల్లో తమ వివరాలను నమోదు చేసుకుంటున్నారు. దరఖాస్తు దారుల నుంచి వచ్చిన వినతులను తహశీల్దార్లు పరిశీలించి అర్హులైన వారితో జాబితాలను ప్రభుత్వానికి పంపుతున్నారు.

డ్రగ్స్ రహిత సమాజ లక్ష్యం

- గంజాయిపై ఉక్కుపాదం
- వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

డ్రగ్స్ (మాదక ద్రవ్యాలు) రహిత సమాజం లక్ష్యం కావాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. నషా ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా నగరంలోని అరసవల్లి రోడ్డు నుంచి 80 అడుగుల రోడ్డు వరకు ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులతో కలిసి గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని మంత్రి అచ్చెన్నాయుడు జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీ అనంతరం ఒక ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. టిడిపి కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక మాదకద్రవ్యాల నియంత్రణపై ప్రత్యేక దృష్టిసారించామన్నారు. విద్యాలయాల్లో డ్రగ్స్ నియంత్రణకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈగల్ టీమ్ ప్రత్యేకంగా మాదకద్రవ్యాల నియంత్రణకు చర్యలు తీసుకుంటుందని చెప్పారు. గంజాయిపై ఉక్కుపాదం మోపనున్నట్లు వెల్లడించారు. సమాజ పరిరక్షణ కోసమే మాదక ద్రవ్యాలపై ఈ ఉద్యమమని తెలిపారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా రాష్ట్రం, ముఖ్యంగా ఉత్తరాంధ్ర ప్రాంతం గంజాయి కేంద్రంగా, అడ్డాగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. యువతను డ్రగ్స్ బారి నుంచి రక్షించేందుకు డ్రగ్స్ వద్దు బ్రో అంటూ ప్రచారం చేపట్టినట్లు గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కేబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేసి ఈగల్ అనే ప్రత్యేక వ్యవస్థను తీసుకువచ్చిందని తెలిపారు. గంజాయి సాగు చేసే రైతులకు కౌన్సెలింగ్ ఇస్తూ, వారికి ప్రత్యామ్నాయ పంటల సాగు కోసం ఆర్థిక సాయం అందిస్తున్నామని చెప్పారు. ఒకప్పుడు గంజాయి గుట్టలున్న చోట నేడు పరిశ్రమలు వస్తున్నాయన్నారు. జిల్లాను గంజాయి, డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దుతామని చెప్పారు.

ప్రతి కళాశాలపై ఫోకస్ గ్రూపులు : కలెక్టర్

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ మత్తు పదార్థాల వాడకం వల్ల తల్లిదండ్రులు గౌరవం కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి కళాశాలలో ఫోకస్ గ్రూపులు ఏర్పాటు చేశామని, ఎవరిపైనా అనుమానం వచ్చినా వెంటనే అధికారులకు తెలియజేయాలని సూచించారు.



ర్యాలీలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు

టోల్‌ఫ్రీ నంబరు 1972కు సమాచారం ఇవ్వండి : ఎస్‌పి

జిల్లాలో గంజాయి సాగు లేకున్నా, రవాణా సాగుతోందని ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి తెలిపారు. డ్రోన్ల సాయంతో నిరంతర పర్యవేక్షణ కొనసాగుతోందని చెప్పారు. గతేడాది 270 మందిని అరెస్టు చేశామని వెల్లడించారు. రిమ్స్, వైజాగ్‌లో డీ-అడిక్షన్ కేంద్రాలు అందుబాటులో ఉన్నాయన్నారు. సరదాగా మొదలయ్యే మత్తు జీవితాన్ని నాశనం చేస్తుందని హెచ్చరించారు.

ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ మత్తు పదార్థాలు కెరీర్‌ను, ఆరోగ్యాన్ని, కుటుంబాన్ని నాశనం చేస్తాయన్నారు. మానసిక నిపుణులు అఖిల మాట్లాడుతూ స్నేహితుల ఒత్తిడి వల్ల, సరదాగా తీసుకునే ప్రయత్నాల వల్లే మత్తుకు బానిసత్వం మొదలవుతుందన్నారు. డ్రగ్స్ బారిన పడితే డీ-అడిక్షన్ కేంద్రాల్లో సాయం కోరాలని సూచించారు. అనంతరం మత్తు దుష్పరిణామాలపై సందేశాత్మక షార్ట్ ఫిల్మ్‌ను ప్రదర్శించారు. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా డిఎస్‌పి వివేకానంద ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ సాయిప్రత్యూష, డిసిఎంఎస్ చైర్మన్ చౌదరి అవినాష్, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలపై సత్వర స్పందన

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

రెవెన్యూ సమస్యలపై సత్వరమే స్పందించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌తో కలిసి శ్రీకాకుళం రెవెన్యూ డివిజన్‌కు సంబంధించి తహశీల్దార్లు, హెచ్‌డిటిలు, మండల సర్వేయర్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, కోర్టు కేసులు, విఆర్‌ఒలతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తహశీల్దార్లు విఆర్‌ఒలతో ప్రతి వారం సమావేశం నిర్వహించాలని ఆదేశించారు. హెచ్‌డిటి స్థాయిలోనే సమస్య పరిష్కారం కావాలన్నారు. ప్రతి మంగళవారం విఆర్‌ఒలతో తహశీల్దార్ సమావేశం నిర్వహించాలని ఆదేశించారు. వారానికో మండలంతో సమావేశం నిర్వహించాలని డిఆర్‌ఒ వెంకటేశ్వరరావును ఆదేశించారు. ప్రతి సమస్యపై హెచ్‌డిటి స్పందించాలని చెప్పారు. ఈ-ఆఫీస్‌పై తహశీల్దార్లకు అవగాహన కల్పించాలని సూచించారు. విఆర్‌ఒలు పలు రెవెన్యూ సమస్యలపై పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. రెవెన్యూ సమస్యలపై అవగాహన లేకపోతే విఆర్‌ఒలకు శిక్షణ ఇస్తామన్నారు. ఇహెచ్‌ఎస్ ఆస్పత్రి నిర్మించేందుకు స్థలం కోసం ప్రతిపాదనలు పంపాలని సైనిక సంక్షేమ అధికారిని ఆదేశించారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, ఎపిఐఐసి భూ సమస్యపై చర్చించారు. గార మండలంలో డిసిసిబి, జలుమూరు మండలంలో వైద్యారోగ్యశాఖ, గార మండలంలో డిఆర్‌డిఎ, ఎచ్చెర్లలో ఆర్‌టిఒ, సరుబుజ్జిలి, రణస్థలం మండలాల్లో అంగన్వాడీ కేంద్రాలు, శ్రీకాకుళంలో మార్క్‌ఫెడ్, పర్యాటక శాఖకు సంబంధించి భూ సమస్యలపై చర్చించారు. భూమి త్వరగా తీసుకొని నిధులు వృథాగా పోకుండా పనులు ప్రారంభించాలని ఆదేశించారు. పిజిఆర్‌ఎస్‌పై విఆర్‌ఒలు అర్జీలు పెండింగ్‌లో ఉండరాదని కలెక్టర్ ఆదేశించారు.

22ఎ భూములను తక్షణమే పరిశీలించాలని ఆదేశించారు. తహశీల్దార్లు సంబంధిత ప్రొఫార్మాపై భూమి వివరాలు పంపాలన్నారు. 22ఎలో భూ యజమానులకు ముందుగా నోటీసులు పంపి పరిశీలనకు వెళ్లాలని కలెక్టర్ ఆదేశించారు. 22ఎలో ఎలాంటి కేసులు పెండింగ్‌లో ఉండరాదన్నారు. తహశీల్దార్ విఆర్‌ఒను తీసుకుని ఇళ్ల స్థలాల పరిశీలన చేసి అక్కడ నిర్మాణాలు ప్రారంభించారా? లేదా? పరిశీలన చేసి నిర్మాణాలు ప్రారంభించకపోతే అలాంటి జాబితా తయారు చేయాలని తహశీల్దార్లను ఆదేశించారు. మండల సర్వేయర్లు సర్వేపై దృష్టిసారించి సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు.

ఖర్మయోగి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు చెప్పారు. ప్రతి ఉద్యోగి లాగిన్ చేసుకోవాలన్నారు. తహశీల్దార్లు టెక్నికల్ సమస్యలు ఫాలో చేయాలని జెసి చెప్పారు. పట్టాదారు పాసు పుస్తకాలు జారీ చేయాలన్నారు. సివిల్ సమస్యలపై తలదూర్చరాదని ఆదేశించారు. ఎస్‌ఎల్‌ఆర్‌పై సరైన సమాచారం అందించాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు, ఆర్‌డిఒ కె.సాయి ప్రత్యూష, డిప్యూటీ కలెక్టర్లు జి.జయదేవి, డి.పద్మావతి, జిల్లా అధికారులు, తహశీల్దార్లు, హెచ్‌డిటిలు, ఆర్‌ఐలు, సర్వేయర్లు, విఆర్‌ఒలు తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతుల అభివృద్ధికి చర్యలు

పశుసంవర్థకశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



నట్టల నివారణ మందులు వేస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - కోటబొమ్మాళి

పశుపోషణ రంగాన్ని బలోపేతం చేసేందుకు ప్రభుత్వం నిబద్ధతతో పనిచేస్తోందని రాష్ట్ర వ్యవసాయ, పశుసంవర్ధక శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. రైతులు నష్టపోకుండా ఉండేందుకు పశువులకు బీమా భరోసా కల్పిస్తున్నామని తెలిపారు. ఇప్పటికే మరణించిన పశువుల బీమా కింద ప్రభుత్వం రూ.103 కోట్లు విడుదల చేసినట్లు వివరించారు. మండల కేంద్రంలోని వంశధార కార్యాలయ ఆవరణలో గొర్రెలకు నట్టల నివారణ మందుల పంపిణీ కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పాడి రైతులకు అండగా నిలవాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 2025-26 సంవత్సరానికి సంబంధించి 1.76 కోట్ల గొర్రెలు, 55 లక్షల మేకలతో కలిపి మొత్తం 2.31 కోట్ల జీవాలకు ఉచితంగా నట్టల నివారణ మందులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈనెల 26 నుంచి జూలై 10వ తేదీ వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు.

రైతులు సాంప్రదాయ సాగుకు పరిమితం కాకుండా, లాభసాటి పంటల వైపు దృష్టిసారించాలని సూచించారు. వ్యవసాయంలో ఆధునిక పద్ధతులను ప్రవేశపెట్టి డ్రిప్, స్ప్రింక్లర్ వంటి పరికరాలపై 90 శాతం సబ్సిడీ అందించేందుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. పామాయిల్, కో కో వంటి ఆర్థికంగా లాభదాయకమైన పంటలు సాగు చేయడం ద్వారా ఎకరానికి సంవత్సరానికి రూ.రెండు లక్షల ఆదాయం పొందవచ్చని వివరించారు. అంతర పంటలుగా సాగు చేయడం వల్ల తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందవచ్చని సూచించారు. కోటబొమ్మాళికి అన్న క్యాంటీన్ మంజూరు చేసినట్లు తెలిపారు. ఉపాధి హామీ పనులకు రూ.200 కోట్లు మంజూరు చేసి, 54 రహదారి పనులు ప్రారంభించామన్నారు. వచ్చే నెల నుంచి గ్యాస్ సబ్సిడీ మొత్తాలను వారి ఖాతాల్లో ముందుగానే జమ చేయనున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు కంచరాన రాజగోపాల్, టెక్కలి ఉప సంచాలకులు పోతనపల్లి చంద్రశేఖరరావు, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరివర ప్రసాద్, వెలమల కామేశ్వరరావు, విజయలక్ష్మి, నంబాల శ్రీను, గొర్రెలు, మేకల సహకార సంఘ అధ్యక్షులు కుజ్జు తాతయ్య, కోటబొమ్మాళి సహాయ సంచాలకులు లోకనాథం, పశు వైద్యులు కిరణ్ కుమార్, ప్రజ్ఞ చైతన్య, రాజ్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

సేవలతోనే గుర్తింపు

ఎమ్మెల్యే గొండు శంకర్



బెడ్‌లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

రోటరీ క్లబ్ చేస్తున్న సేవా కార్యక్రమాలు ప్రశంసనీయమని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. సింగుపురం కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో రోటరీ క్లబ్ శ్రీకాకుళం బృందం, విద్యార్థులకు సుమారు రూ.ఆరు లక్షలు విలువైన 225 పరుపులను ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెరుగుతున్నాయని చెప్పారు. విద్యార్థులు బాగా చదువుకుని లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని సూచించారు. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను ప్రభుత్వం అందజేస్తుందన్నారు. రోటరీ క్లబ్ శ్రీకాకుళం అధ్యక్షులు ముని శ్రీనివాస్ బృందం విద్యార్థుల అవసరాలను గుర్తించి, వాటిని తీర్చడం ద్వారా ఉదారతను చాటుకుందని ప్రశంసించారు. రోటరీ క్లబ్ సేవలు మరింత విస్తృతం కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష పిఒ ఎస్.శశిభూషణ్, రోటరీ క్లబ్ శ్రీకాకుళం అధ్యక్షులు ముని శ్రీనివాస్, కార్యదర్శి దూసి సంతోష్, కోశాధికారి సూర్య పసగాడ, సభ్యులు మంత్రి వెంకటస్వామి, సింగుపురం సర్పంచ్ గుండ ఆదిత్య నాయుడు, ఉప సర్పంచ్ కుంచాల ఆదినారాయణ, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల వినూత్న నిరసన

పాడైన పనిముట్లతో ఆందోళన



పనిముట్లతో నిరసన తెలుపుతున్న పారిశుధ్య కార్మికులు

ప్రజాశక్తి- పలాస

పనికి తగిన పనిముట్లు ఇవ్వాలని, పిఎఫ్ డబ్బులు కార్మికుల ఖాతాల్లో జమ చేయాలని, చనిపోయిన, విశ్రాంత కుటుంబ సభ్యులకు ఉద్యోగం ఇవ్వాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు కె.వెంకట్, బి.కూర్మారావు, నాయకులు, సిహెచ్.మురగన్, ఎం,రవి డిమాండ్ చేశారు. ఈ మేరకు పాడైన పనిముట్లతో కాశీబుగ్గ గాంధీ విగ్రహం వద్ద గురువారం పారిశుధ్య కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ శానిటేషన్ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఎన్నిసార్లు విన్నవించుకున్ని పట్టించుకోవడం లేదని వాపోయారు. సమస్యలు పరిష్కారమయ్యే వరకూ నిరసన కొనసాగుతుందని స్పష్టం చేశారు. పనిముట్లు లేకుండా శానిటేషన్ పనులు ఎలా చేయాలని ప్రశ్నించారు. అలాగే పిఎఫ్ డబ్బులు 2011-12 సంవత్సరాలకు రూ.33.50 లక్షలు కార్మికుల ఖాతాల్లో జమచేయకుండా కాలయాపన చేస్తుందన్నారు. పెరుగుతున్న మున్సిపాలిటీకి తగ్గట్టు కార్మికులను పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నాయకులు కె.ఈశ్వరరావు, పి.బాలకృష్ణ, ఎస్.రమేష్, ఎస్.తిరుపతి, ప్రకాష్‌ముఖి, ఢిల్లీ, ఆమర్, ఎస్.శంకర్, ఎస్.గులాబి, ఎస్.ఉష, ఎస్.లక్ష్మి పాల్గొన్నారు.

'ఉపాధి'తో మారుతున్న మార్గాలు

ప్రభుత్వ విప్ అశోక్



శంకుస్థాపన చేస్తున్న విప్ అశోక్

ప్రజాశక్తి- కవిటి

ప్రతి గ్రామాన్నీ అభివృద్ధి బాటలో నడిపించేందుకు ఉపాధి హామీ అద్భుతమైన సాధనమని, అవసరాలను గుర్తించి పని అవకాశాలుగా మలచుకుంటే మార్పు అనివార్యమని ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ అన్నారు. మండలంలోని రాజపురం వెళ్లే రోడ్డులో వాటర్ ట్యాంక్ నుంచి కర్రి రామయ్య తోట వరకు దారిని మెరుగుపరిచే పనులకు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రూ.7 లక్షల అంచనా వ్యయంతో చేపట్టిన ఈ పనులు, గ్రామస్తుల అవసరాలను తీర్చడమే కాకుండా, ఎన్నో కుటుంబాలకు ఉపాధిని కలిగిస్తున్నాయన్నారు. ప్రతి రూపాయీ పనికొచ్చేలా ఖర్చు చేయాలన్నారు. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడాలన్నదే తన ఆశయమన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ మురళీమోహన్, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ శ్రీనివాస్‌రెడ్డి, ఎపిఒ మోహనరావు, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ లోల్ల రాజేష్, జెడ్‌పిటిసి మాజీ సభ్యుడు బెందాళం రమేష్, ఆరింగి మధు, ఆరింగి త్రివిక్రమరావు పాల్గొన్నారు.

క్రీడలకు ప్రాధాన్యం పెరగాలి

శ్రీకాకుళం సిటీ: పాఠశాల విద్యలో క్రీడలకు ప్రాధాన్యత పెరగాలని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యూనివర్శిటీ పూర్వ రిజిస్ట్రార్ గుంట తులసీరావు అన్నారు. స్థానిక కేంద్రీయ విద్యాలయంలో కేంద్రీయ విద్యాలయ సంఘటన్, హైదరాబాద్ రీజియన్ అండర్-14 క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. విజేతలకు బహుమతులు, మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో విద్యార్థులను ప్రోత్సహించాలన్నారు. చదువులోనే కాకుండా క్రీడల్లోనూ రాణించడం అవసరమన్నారు. క్రీడలతోనే విద్యార్థుల్లో సమగ్ర వికాసం సాధ్యమనికేంద్రీయ విద్యాలయ ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ బి.లవ్‌కుమార్ అభిప్రాయపడ్డారు. ఈ క్రీడల్లో రీజియన్‌కు చెందిన వివిధ కేంద్రీయ విద్యాలయాల నుంచి ఏడు జట్లు, 101 మంది విద్యార్థులు ఈ టోర్నీలో పాల్గొన్నారు.



విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న తులసీరావు

మాదకద్రవ్యాలకు గుడ్ బై చెబుదాం



కవిటి : అవగాహన కల్పిస్తున్న విప్ అశోక్

ప్రజాశక్తి- కవిటి

అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని కవిటిలో జరిగిన అవగాహన ర్యాలీ సందేశాత్మకంగా మారింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రభుత్వ విప్ డాక్టర్ బెందాళం అశోక్ యువతకు మార్గదర్శకంగా నిలిచారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు భవిష్యత్‌ను నాశనం చేసే అస్త్రాలని, వీటిని దూరం పెట్టాలంటే అవగాహన, నిబద్ధత, సమాఖ్య శక్తి ఒక్కటే మార్గమని అన్నారు. యువత మాదకద్రవ్యాల వలయంలో పడకుండా ఉండేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజం ఐక్యంగా పనిచేయాలన్నారు. ముఖ్యంగా ఈ తరం యువత మాదకద్రవ్యాలను తిరస్కరిస్తేనే ఆరోగ్యకరమైన సమాజం రూపుదిద్దుకుంటుందని ఎమ్మెల్యే చెప్పారు. ప్రభుత్వం మాదకద్రవ్యాల కట్టడి కోసం నూతన చర్యలు తీసుకుంటోందని, అయితే ప్రజల భాగస్వామ్యం లేకుండా దాంట్లో విజయాన్ని సాధించలేమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ లోల్ల రాజేష్, ఇచ్ఛాపురం సిఐ చిన్నంనాయుడు, కవిటి ఎస్ఐ రవివర్మ, బెందాళం రమేష్, ఆరింగి మధు, ఆరింగి త్రివిక్రమరావు, పొల్లాయి లక్ష్మణమూర్తి పాల్గొన్నారు.

పాతపట్నం : అంతర్జాతీయ మాదకద్రవ్యాల దినోత్సవం సందర్భంగా స్థానిక మెయిన్ రోడ్డులో స్థానిక ఎమ్మెల్యే గోవిందరావు అధ్యక్షతన అన్ని శాఖల అధికారులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సిఐ వి.రామారావు, ఎస్ఐ బి.లావణ్య, తహశీల్దార్ ఎన్.ప్రసాదరావు, ఎంపిడిఒ పి.చంద్రకుమారి, టిడిపి మండల అధ్యక్షులు పైల బాబ్జి, సైలాడ సతీష్ పాల్గొన్నారు.

నరసన్నపేట : మండల పరిషత్ కార్యాలయం నిర్వహించిన డ్రక్స్‌కు వ్యతిరేకంగా నిర్వహించిన ర్యాలీలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన, ఎస్ఐ తదితరులు పాల్గొన్నారు.

పలాస : మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని ఆర్‌డిఒ జి.వెంకటేష్ అన్నారు. జాతీయ మాదక ద్రవ్యాల అక్రమ రవాణా నిర్మూలన దినోత్సవం సందర్భంగా ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి కాశీబుగ్గ మూడు రోడ్ల కూడలి వరకూ అధికారులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారం నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, తహశీల్దార్ కళ్యాణ చక్రవర్తి, ఎంపిడిఒ వసంతకుమార్, డిప్యూటీ ఎంపిడిఒ మెట్ట వైకుంఠరావు, ఎంఇఒలు సిహెచ్.శ్రీనివాసరావు, చెరుకుపల్లి సత్యం, కాశీబుగ్గ సిఐ సూర్యనారాయణ, ఎక్సైజ్ సిఐ మల్లేశ్వరరావు, ఐసిడిఎస్ పిఒ పార్వతి, టిడిపి నాయకులు గాలి కృష్ణారావు అంబటి కృష్ణమూర్తి, దువ్వాడ శ్రీకాంత్ పాల్గొన్నారు.

జడ్జి యు.మాధరి ఆధ్వర్యాన మండల న్యాయ సేవా సంఘం, న్యాయవాదులు, రెవెన్యూ, ఆరోగ్య, డిగ్రీ కాలేజీ ఉపాధ్యాయులు, విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి కోర్టు ఆవరణలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. తహశీల్దార్ కళ్యాణ చక్రవర్తి, ఎపిపి రమేష్, న్యాయ వాదులు బేకేర్ పట్నాయక్, రాజారత్నం, ఎన్. విశ్వేశ్వరరావు, జి. ప్రభాకరరావు, టి.శ్యామ్‌సుందర్, పి.చిట్టిబాబు, వి.రవి పాల్గొన్నారు.

టెక్కలి : ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తి ఆధ్వర్యాన అధికారులతో, జూనియర్, డిగ్రీ కళాశాలల విద్యార్థులతో మెయిన్ రోడ్డులో ర్యాలీ నిర్వహించారు. అనంతరం డ్రగ్స్ వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సిఐ అంబటి విజయకుమార్, ఎక్సైజ్ సిఐ షేక్ మేరా సాహెబ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

స్థానిక విశ్వజ్యోతి డిగ్రీ కళాశాలలో టెక్కలి సినియర్ సివిల్ జడ్జి బి.నిర్మల అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టెక్కలి బార్ ఆసోసియేషన్ అధ్యక్షులు పినకాన ఆజయ్‌కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ పినకాన జోగారావు, టెక్కలి పట్టణ ఎస్ఐ బి. రాము, న్యాయవాదులు పాల్గొన్నారు.

అలాగే స్థానిక డిగ్రీ కళాశాల విద్యార్థులు ఇందిరాగాంధీ కూడలి వరకూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబూరు గోవిందమ్మ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బేపల సతీష్‌కుమార్, కో-ఆర్డినేటర్ లూక్‌పాల్, ఝాన్సీరాణి, వాసు బాబు, సత్యనారాయణ, ధర్మారావు, మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

కొత్తూరు : అంతర్జాతీయ డ్రగ్స్ నిషేధం దినోత్సవం సందర్భంగా మండలంలోని నివగాం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ ఆగతముడి సాయిరాం, అధ్యాపకులు టి. ఆదినారాయణ, నవీన్, ప్రవీణ్, హరికృష్ణ, చందన, ధనలక్ష్మి, స్వాతి పాల్గొన్నారు.

అలాగే సిఐ చింతాడ ప్రసాదరావు ఆధ్వర్యాన విద్యార్థులు పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఐ మహమ్మద్ అమీర్ ఆలీ పాల్గొన్నారు.

టెక్కలి రూరల్ : స్థానిక ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో మాదకద్రవ్యాలు వినియోగంపై కలిగే నష్టాలను ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు అవగాహన కల్పించి విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డాక్టర్ ఆర్.శాంతికుమార్, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేట్ ఎస్.మారుతికుమార్, వార్డెన్ డాక్టర్ మళ్ల జయమన్మథరావు, అరగి దశరథ పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: మాదకద్రవ్య రహిత సమాజాన్ని నిర్మిద్దామని మండల ప్రత్యేక అధికారి ఆర్.గడ్డెమ్మ, తహశీల్దార్ ఆర్. అప్పల రాజులు అన్నారు. జాతీయ మాదక ద్రవ్యాల అక్రమ రవాణా నిర్మూలన దినోత్సవం సందర్భంగా తహశీల్దార్ కార్యాలయం నుంచి రైతు బజారు వరకు విద్యార్థులతో కలిసి ర్యాలీ, మానవహారం నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ర్యాలీలో డిప్యూటీ ఎంపిడిఒ జె. అనంద రావు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అరంగి అప్పన్న పాల్గొన్నారు.

సోంపేట : అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకొని స్థానిక సంస్కార భారతి విద్యాసంస్థల వద్ద ఎక్సైజ్ సిఐ రమణ అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి, ప్రోత్సాహకాలను అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు శ్రీరామ్మూర్తి, కవిబాబు, ఈగల్ టీం సభ్యులు సంతోష్, ఎక్సైజ్ సిబ్బంది మార్కారావు, గుణాకర్, సూర్యారావు, ఉమాపతి, అరుణ్ పాల్గొన్నారు.

అంతర్జాతీయ మత్తు పదార్థాల నివారణా దినోత్సవం పురస్కరించుకొని బారువా మెరైన్ సిఐ వి.రమేష్ ఆధ్వర్యాన బారువ ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు రామారావు, రాజేంద్రప్రసాద్, హైస్కూల్ ఉపాధ్యాయులు విశ్వేశరావు, చిట్టిబాబు, సంపతరావు, ఎస్ఐలు శ్రీనివాసరావు, ఎన్.శ్రీనివాస్, కోదండం, మాధవరావు పాల్గొన్నారు.

స్థానిక పోలీసుల సోంపేట పట్టణంలో విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎసఐ లవరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : సిఐ చిన్నంనాయుడు ఆధ్వర్యాన జ్ఞాన భారతి విద్యార్థులు, అంగన్వాడీ కార్యకర్తలతో ర్యాలీ నిర్వహించారు. తహశీల్దార్ వెంకటరావు, కమిషనర్ ఎన్.రమేష్, ఎంఇఒ అప్పారావు, ఎంపిడిఒ రామారావు, జ్ఞాన భారతి విద్యా సంస్థల కార్యదర్శి జోహర్‌ఖాన్, టౌన్ ఎస్ఐ ముకుందరావు పాల్గొన్నారు.

నందిగాం : స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించిన ర్యాలీలో తహశీల్దార్ పి.సోమేశ్వరరావు, ఎంపిడిఒ కుమార్‌పట్నాయక్, ఎస్ఐ షేక్ మహమ్మద్ అలీ, ఎంఇఒ సింహాచలం, రామారావు, మనోరత్నం, అలాగే ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కళాశాల ప్రిన్సిపాల్ మార్పు కృష్ణమోహన్ ఆధ్వర్యంలో విద్యార్థులో ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు.

మెళియాపుట్టి : మండల కేంద్రంలో ర్యాలీ, మానవహారం నిర్వహించిన కార్యక్రమంలో ఎంపిడిఒ నరసింహ ప్రసాద్ పండా, ఎస్ఐ పి.రమేష్‌బాబు, ఎంఇఒలు ఎస్.దేవేంద్రరావు, పద్మనాభరావు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమౌళి, ఎస్‌కెకె ప్రిన్సిపాల్ ఎస్.దయానంద్, సీనియర్ అసిస్టెంట్ జగన్మోహనరావు, ఎపిఒ రవి, ఎపిఎం త్రినాథమ్మ పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు: కాశీబుగ్గ రూరల్ సిఐ ఎం.తిరుపతి ఆధ్వర్యాన మండలంలోని పూండి బస్టాండ్ మూడు రోడ్లు కూడలి నుంచి వైఎస్‌ఆర్ కూడలి వరకు యాంటీ డ్రగ్స్ అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీలో సాయివినీత్, ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు పాల్గొని నినాదాలు చేశారు. ఎంపిడిఒ ఎన్.రమేష్‌నాయుడు, డిటి మురళీకృష్ణ, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పి.ఈశ్వరరావు, కె.రమణ, ప్రిన్సిపాల్ రమేష్‌పట్నాయక్, ఎ.కైలాషరావు, సాయిగోపాల్ పాల్గొన్నారు.

శ్రీకాకుళం సిటీ: విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ప్రభుత్వ మహిళా కళాశాల అటానమస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్య చంద్రరావు పిలుపునిచ్చారు. శ్రీకాకుళం నాశముక్త క్లబ్ ఆధ్వర్యంలో గురువారం సమావేశం నిర్వహించి, నాశముక్త భారత్ అభియాన్ ర్యాలీ కళాశాలలో నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులలందరూ మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, ఆరోగ్యవంతమైన, మత్తు రహిత భారతదేశాన్ని నిర్మించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎంబిఎ క్లబ్ కో-ఆర్డినేటర్ ఎల్.కృష్ణారావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు ఎస్.మాధవీలత, ఎస్.రుద్రమరాణి పాల్గొన్నారు.

ఆమదాలవలస: మాదకద్రవ్య వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తమ్మినేని గీత, సిఐ పి.సత్యనారాయణ, తహశీల్దార్ ఎస్.రాంబాబు, ఎంపిడిఒ ఆర్.వెంకటరావు, టిడిపి నాయకులు మొదలవలస రమేష్ ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని వన్వే జంక్షన్ నుంచి పాల పోలమ్మ గుడి జంక్షన్ వరకు నిర్వహించిన ర్యాలీలో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

సరుబుజ్జిలి: కాకితాపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం ఎం.వి రమణమూర్తి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాదకద్రవ్య వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి నశాముక్త భారత్ డ్రగ్స్ వద్దు బ్రో ప్రచార పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా డ్రగ్స్ వాడకాన్ని వ్యతిరేకించే ప్రతిజ్ఞ విద్యార్థులతో చేయించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రభాకరరావుతో పాటు ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



పలాస : ప్రతిజ్ఞ చేస్తున్న ఆర్‌డిఒ వెంకటేష్

అలాగే మండల కేంద్రంలో ఎంపిడిఒ ఎం.పావని, ఎస్ఐ బి.హైమావతి ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులతో భారీ ర్యాలీ నిర్వహించారు.

రణస్థలం: జె.ఆర్.పురం ఎస్ఐ ఎస్.చిరంజీవి ఆధ్వర్యంలో మండల కేంద్రంలో డ్రగ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ అవగాహన ర్యాలీలో విద్యార్థులు, ఎఎస్ఐ ఉమా మహేశ్వరరావు, పిసి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

బూర్జ : మండలంలో కొల్లివలస గ్రామ సమీపంలో ఉన్న తోటవాడ జంక్షన్ నుంచి చీడివలస అంబేద్కర్ గురుకుల విద్యాలయం వరకు బూర్జ జిల్లా పరిషత్ హైస్కూల్, జూనియర్ కళాశాల, కస్తూరిబా బాలికా విద్యాలయం, అంబేద్కర్ గురుకుల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. మార్క్‌ఫెడ్ డైరెక్టర్ రామకృష్ణ నాయుడు, జెడ్‌పిటిసి రామారావు, ఎస్ఐ ప్రవల్లిక, ఎపిఒ రవికుమార్, ఎంఇఒలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పొందూరు: మండల కేంద్రంలో ర్యాలీని నిర్వహించారు. స్థానిక అంబేద్కర్ కూడలి మీదుగా ప్రభుత్వ ఉన్నత పాఠశాల వరకూ నినాదాలు చేస్తూ ర్యాలీ చేపట్టి అంబేద్కర్ కూడలిలో మానవహారాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ వి.సత్యనారాయణ, మాజీ ఎంపిపి కూన ప్రమీల, టిడిపి మండల అధ్యక్షుడు చిగిలిపల్లి రామ్మోహనరావు, ఇఒపిఆర్‌డి సింహాచలం, మండల అధికారులు, టిడిపి నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లావేరు: మత్తుపదార్థాలకు యువత దూరంగా ఉండాలని ఎంపిడిఒ పి.వెంకటరాజు, ఎసఐ జి.లక్ష్మణరావు అన్నారు. మాదక ద్రవ్యాల అక్రమ రవాణా నివారణ దినోత్సవం సందర్భంగా డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. కళాశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఇఒ మజ్జి మురళీకృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న ఇఇ శేఖర్

వంశధార కాలువలో పూడికతీత

పలాస : ఖరీఫ్ సమయంలో శివారు భూములకు సాగునీరు అందించేందుకు వంశధార కాలువల్లో పూడికలు తీసేందుకు రూ.85 లక్షలు ఖర్చు చేస్తున్నామని వంశధార ప్రాజెక్టు ఇఇ శేఖర్ చెప్పారు. కాశీబుగ్గ ప్రాంతంలో గురువారం టిడిపి నాయకులు, నీటి సంఘం నాయకులతో కలిసి పూడికలు తీస్తున్న వంశధార కాలువలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతేడాది శివారు భూములకు సాగునీరు అందిస్తున్నామని తెలిపారు. ఈ ఏడాదీ పూర్తిస్థాయిలో వంశధార నీటిని అందించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. గెడ్డలు, చెరువులు, కాలువలను శుభ్రం చేస్తున్నామని తెలిపారు. ఖరీఫ్ ప్రారంభం కాక ముందే నీటిని విడుదల చేస్తున్నామని అన్నారు. ఆయనతో పాటు నీటి సంఘం అధ్యక్షుడు గొనప నిరంజన్, టిడిపి నాయకులు బి.నాగరాజు, వంశధార ఎఇ రాజశేఖర్ ఉన్నారు.



ఫోన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమణమూర్తి

సమస్యల పరిష్కారమే ధ్యేయం

పోలాకి: ప్రజా సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించడానికే ప్రజా వేదిక నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. మండలంలోని మబగాం క్యాంపు కార్యాలయంలో గురువారం ప్రజావేదిక నిర్వహించారు. ప్రజలు దగ్గర వినతులు స్వీకరించి, పరిశీలించి సంబంధించిన అదికారులతో ఫోన్‌లో మాట్లాడుతూ సమస్యలను పరిష్కరించారు. దీంతో బాధితులు ఆనందం వ్యక్తం చేశారు.

'ఉపాధి'లో అవకతవకల గుర్తింపు

ప్రజాశక్తి- బూర్జ

మండల కేంద్రంలో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంపై నిర్వహించిన సామాజిక తనిఖీల్లో అవకతవకలు బయటపడ్డాయి. మొత్తం 30 పంచాయతీల పరిధిలో దాదాపు రూ.5 లక్షల 82 వేలు అక్రమాలు చోటుచేసుకున్నట్లు సామాజిక తనిఖీ బృందం వెల్లడించింది. ఈ వివరాలను ఎపిఒ రవికుమార్ గురువారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఉపాధిహామీ పథకం కింద నిర్వహించిన పనుల్లో అనుమానాస్పద బిల్లులు, తప్పుడు హాజరు, వేతన చెల్లింపుల్లో అక్రమాలు జరిగినట్లు బృందం నివేదికలో స్పష్టమైందని పేర్కొన్నారు. తదుపరి చర్యలు తీసుకోవాలని అధికారులు సూచించారు.

మిగులు సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి- రణస్థలం

మండలం కొండ ములగాం ప్రభుత్వ ఆదర్శపాఠశాలలో 6వతరగతి, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ఎంపిసి, బైపిసి సీట్లు భర్తీ అయ్యాయని, మిగిలిన సిఇసి, ఎంఇసి సీట్లు ఖాళీలున్నాయని, సీట్లు కావాల్సిన వారు నేరుగా ప్రభుత్వ ఆదర్శ పాఠశాలను సందర్శించాలని ప్రిన్సిపాల్ పి.శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు.

పశు వైద్యాధికారిగా బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి- బూర్జ



అప్పలనాయుడు

మండల కేంద్రంలో పశువైద్యాధికారిగా అప్పల నాయుడు గురువారం బాధ్యతలు స్వీకరించారు. విజయనగరం జిల్లా నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పనిచేసిన పశువైద్యాధికారి జోత్స్న బదిలీపై విజయనగరం జిల్లా పొగిరి గ్రామానికి వెళ్లారు. ఈ సందర్భంగా అప్పలనాయుడు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పాడి రైతులకు అవగాహన కల్పించి పశుసంపదను పెంపొందించేందుకు అన్ని విధాలుగా కృషి చేస్తానన్నారు.



మాట్లాడుతున్న ఆర్‌డిఒ కృష్ణమూర్తి

గ్యాస్ గొడౌన్ తనిఖీ

మెళియాపుట్టి : మండల కేంద్రంలోని స్వరాజ్యలక్ష్మి భారత్ గ్యాస్ గొడౌను ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి గొడౌన్‌లోని సిలిండర్లను పరిశీలించారు. అధిక ధరలకు విక్రయించినా, సరఫరా ఛార్జీలు వసూళ్లు చేసినా, నిబంధనలకు విరుద్ధంగా విక్రయించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం గొడౌన్ పరిసరాలను పరిశీలించారు. ఆయనతోపాటు తహశీల్దార్ బడే పాపారావు సీనియర్ అసిస్టెంట్ జగన్మోహనరావు, గొడౌన్ గ్యాస్ డీలర్ మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

రైతులపై భారం తగ్గించడమే లక్ష్యం

శ్రీకాకుళం రూరల్: రైతుల సాగు ఖర్చులు తగ్గించి, దిగుబడులు పెంచడమే రాష్ట్ర ప్రభుత్వ ఉద్దేశ్యమని ఎమ్మెల్యే గొండు శంకర్ స్పష్టం చేశారు. ఏరువాక పౌర్ణమి అనంతరం రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభమైన విత్తనాలు నాటే కార్యక్రమంలో భాగంగా గురువారం గార మండలం నిజామాబాద్‌లో రైతులకు రాయితీపై వరి విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతన్నల శ్రమకు గౌరవం చెల్లించాలంటే, ముందస్తుగా అవసరమైన విత్తనాలు సన్నద్ధత కల్పించాలన్నారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ కార్యక్రమం ద్వారా రైతులకు సకాలంలో విత్తనాలు అందడం వలన ఖరీఫ్‌సాగు జాప్యం లేకుండా సాగుతుందన్నారు. వ్యవసాయశాఖ అధికారులు, కూటమి నాయకులు, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

సాదాసీదాగా మండల సమావేశం



మాట్లాడుతున్న ఎంపిపి రజని

ప్రజాశక్తి- రణస్థలం

మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపిపి పిన్నింటి రజని అధ్యక్షతన గురువారం రణస్థలం మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా సాగింది. గ్రామీణ ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న మౌలిక వసతులు, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, తదితర అంశాలపై ప్రతిమూడు నెలలకొకసారి నిర్వహించే మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా సాగింది. సంబంధిత శాఖల అధికారులు సర్పంచుల ఎదుట వారి వెంట తెచ్చుకున్న సమాచారాన్ని చదివి వినిపించారు. వర్షాకాలంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఏ ఒక్క అధికారి సమావేశం దృష్టికి తీసుకురాలేదు. వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఎవరూ స్పందించకపోవడం విచారకరం. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై, వాటిని పరిష్కరించేలా సమావేశాలు ఉండాలని, నామమాత్రంగా నిర్వహించడం ఎందుకని ప్రజాప్రతినిధులు మండిపడుతున్నారు. నీరు పరిశుభ్రంగా ఉండేలా, గ్రామంలో ట్యాంకుల ద్వారా మంచినీటిని అందించే విధంగా చూడాలని అధికారులకు సూచించారు. వ్యవసాయాధికారి భాస్కరరావు మాట్లాడుతూ రైతులకు రాయితీపై అందించేందుకు అన్ని రకాల విత్తనాలు, ఎరువులు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. అలాగే మండలంలో ఉన్న ప్రతి రైతు ఇకెవైసి చేసుకోవాలన్నారు. ఎంఇఒ ఎ.త్రినాథరావు మాట్లాడుతూ గ్రామ స్థాయిలో ఉన్న ప్రజాప్రతినిధులు విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు కృషి చేయాలన్నారు. పాతర్లపల్లి పశువైద్యాధికారి చంద్రశేఖర్ మాట్లాడుతూ గొర్రెలకు, మేకలకు నట్టల నివారణ మందులు ఉచితంగా వేయడం జరుగుతుందన్నారు. పాడి రైతులు రూ.500 చెల్లిస్తే ఆడ పెయ్యలు పుట్టేందుకు ఇంజక్షన్ వేయడం జరుగుతుందన్నారు. మత్స్యశాఖ, ఉద్యానవన శాఖ, వెలుగు, ఉపాధిహామీ, ఆర్‌డబ్ల్యుఎస్, అంగన్వాడీ తదితర శాఖల అధికారులు ఆయా శాఖలకు సంబంధించిన నివేదికలను చదివి వినిపించారు. పలు శాఖల అధికారులు సమావేశానికి గైర్హాజరయ్యారు. ఎంపిపి రజని మాట్లాడుతూ వస్తుంది వర్షాకాలం కాబట్టి గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా చేయాలని, తాగునీటి ట్యాంకుల వద్ద క్లోరినేషన్ చేయించాలని అధికారులకు సూచించారు. సమావేశంలో ఎంపిపి ప్రతినిధి పిన్నింటి సాయికుమార్, జడ్‌పిటిసి టొంపల సీతారాముడు, ఎంపిడిఒ ఈశ్వరరావు, డిప్యూటీ తహశీల్దార్ హేమసుందర్, వైస్ ఎంపిపిలు రాయపురెడ్డి భుజంగరావు, మైలపల్లి కాముడు, పలుశాఖల అధికారులు, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

పిజిసెట్‌లో సత్తా చాటిన విద్యార్థులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

నగరంలోని కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు ఎపి పీజీ సెట్‌లో ఉత్తమ ర్యాంకులు సాధించారు. రాష్ట్రస్థాయిలో ఎలక్ట్రానిక్స్ విభాగంలో యామిని సంపతిరావు 5వ ర్యాంక్, కంప్యూటర్ సైన్స్ విభాగంలో రోజశ్రీ మరువాడ, 10వ ర్యాంక్ సాధించారు, కంప్యూటర్ సైన్స్ విభాగంలో వరుసగా 38, 53, 143 ర్యాంకులు, ఎలక్ట్రానిక్స్ విభాగంలో 64, 91 ర్యాంకులు, స్టాటిస్టిక్స్ విభాగంలో 104వ ర్యాంకు సాధించినట్లు కళాశాల డైరెక్టర్ బిఎస్ చక్రవర్తి, ప్రిన్సిపాల్ కె.శివశంకర్ తెలిపారు. శివ శంకర్ మాట్లాడుతూ కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు ఐసెట్‌లోనే కాకుండా పీజీసెట్, ఎడ్‌సెట్ ఫలితాల్లో కూడా ఉత్తమ ప్రతిభ చూపించారన్నారు.



శ్రీకాకుళం సిటీ : విద్యార్థినులను అభినందిస్తున్న కళాశాల ప్రతినిధులు

ఆమదాలవలస, పొందూరు: పట్టణంలోని మెట్టక్కివలసకు చెందిన చింతాడ లక్ష్మీ గాయత్రి ఎపి పీజీసెట్ హిస్టరీ విభాగంలో 100 మార్కులకు గాను 94 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో 7వ ర్యాంక్ సాధించి సత్తా చాటింది. ఈమె తండ్రి చింతాడ ప్రేమకుమార్ ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తుండగా, తల్లి సత్యవతి గృహిణి. ఈమె గతంలో చెస్ చాంపియన్‌గా జాతీయస్థాయిలో సత్తా చాటింది. సివిల్స్ సాధించడమే తన లక్ష్యంగా సాధన చేస్తున్నట్లు ఆమె తెలిపారు. పొందూరుకు చెందిన పుక్కల్ల సందీప్ కెమికల్ సైన్స్‌లో 100కు 61 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో 34వ ర్యాంకును సాధించాడు. సందీప్‌ను స్థానిక సిస్టమ్ కళాశాల కరస్పాండెంట్ మోహనరావు అభినందించారు.



లక్ష్మీ గాయత్రి



సందీప్

ప్రభుత్వ కళాశాలలో నాణ్యమైన విద్య

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

ప్రభుత్వ కళాశాలలో విద్యార్థులకు అన్ని సౌకర్యాలతో పాటు నాణ్యమైన విద్యను ప్రభుత్వం అందిస్తుందని అగ్నికుల క్షత్రీయ డైరెక్టర్ పుచ్చ ఈశ్వరరావు, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి కర్ని రమణ అన్నారు. మండలంలోని పూండి గోవిందపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు గురువారం పాఠ్య, నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం విద్యార్థులకు పాఠ్య, నోట్ పుస్తకాలు, బ్యాగ్ మధ్యాహ్న భోజనం అమలు చేస్తుందన్నారు. విద్యార్థులు తరగతులు జాగ్రత్తగా విని మంచి ప్రణాళికలతో పరీక్షలు రాసి మార్కులు సాధించి ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు. డ్రగ్స్, చెడు అలవాటులకు దూరంగా ఉండాలన్నారు. విద్యార్థులు కళాశాల సమయానికి హాజరుకావలని, ఎలాంటి సమస్యలు ఉన్నా మీ అధ్యాపకులు అడిగి తెలుసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమేష్ పట్నాయక్, సిబ్బంది కేశవరావు, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాలను పంపిణీ చేస్తున్న నాయకులు



నిందితుడిని ప్రవేశపెట్టిన సిఐ శ్రీనివాసరావు

తమ్ముడు హత్య కేసులో అన్న అరెస్టు

నందిగాం: మండలంలోని కామదేనువులో తమ్ముడ్ని హత్య కేసులో అన్నను గురువారం అరెస్టు చేశామని టెక్కలి సిఐ కె.శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గురువారం నిందితుడిని విలేకరుల ముందు ప్రవేశపెట్టారు. కిల్లి లక్ష్మణరావు కుమారులు ధర్మారావు, తవిటినాయుడు అనే అన్నదమ్ముల మధ్య మూడేళ్లుగా భూ విషయంపై తగాదా నడుస్తుంద న్నారు. ధర్మారావుకు పెళ్లి కావడం, తవిటినాయుడుకు పెళ్లి కాకపోవడంతో తండ్రి తనకు కొంత ఆస్తిని ఉంచుకుని కుమారులకు సమానంగా ఆస్తిని పంచారని తెలిపారు. ఆస్తి పంపకంలో తనకు అన్యాయం జరిగిందని ధర్మారావు భావించడంతో అన్నదమ్ముల మధ్య తరచూ తగాదా జరుగుతుందన్నారు. ఖరీఫ్ సీజన్ కావడంతో ఈ నెల 22న తవిటినాయుడు పొలం పనులు చేశారని అన్నారు. విషయం తెలుసుకున్న అన్న ధర్మారావు వచ్చి తనకు రావాల్సిన ఆస్తి తనకు రాకుండా తమ్ముడు అడ్డుపడుతున్నారని కోపోద్రిక్తుడై తనతో తెచ్చుకున్న మోడేసి పారతో తలపై మోదడంతో తవిటినాయుడు మృతి చెందారని అన్నారు. ధర్మారావును నర్సిపురం కూడలి వద్ద అరెస్టు చేసి పలాస కోర్టుకు తరలించగా రిమాండ్ విధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ షేక్ మహమ్మద్ అలీ, సిబ్బంది పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న క్లూస్ టీమ్

మూడు షాపుల్లో చోరీ

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం మున్సిపాలిటీ పరిధిలోని రత్తకన్నలో అర్ధరాత్రి హైటెక్‌లో సిసి కెమెరాలకు చిక్కకుండా వరుసగా మూడు షాపుల్లో చోరీ జరిగింది. రత్తకన్న మెయిన్ రోడ్డులోని వరుసగా ఉన్న మూడు షాపుల్లో సిసి కెమెరాలకు చిక్కకుండా గొడుగు అడ్డం పెట్టుకొని విద్యుత్ కనెక్షన్ తొలగించి చోరీకి పాల్పడ్డారు. ఈ షాపుల్లో రూ.లక్ష వరకు నగదు చోరీకి గురైంది. విషయం తెలుసుకున్న పట్టణ ఎస్ఐ ముకుందరావు ఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. క్లూస్ టీమ్ కూడా వచ్చి ఆధారాలను సేకరించారు. షాపుల యజమానుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని యువకుడు మృతి

వజ్రపుకొత్తూరు: మండలంలోని పెద్దమురహరిపురానికి చెందిన గొరకల వైకుంఠరావు (33) గురువారం పూండి రైల్వే స్టేషన్ వద్ద గుర్తు తెలియని రైలు ఢీకొని మృతి చెందారు. వైకుంఠరావు రాజమండ్రిలో కూలీ పనులు చేసుకుంటున్నాడు. ఇటీవల స్వగ్రామం వచ్చిన వైకుంఠరావు తిరిగి రాజమండ్రి వెళ్లేందుకు పూండి రైల్వేస్టేషన్లో పాసింజర్ రైలు ఎక్కే ఆత్రుతతో వెళ్తున్న పట్టాలపై ప్రమాదం చోటు చేసుకుంది. రైలు కింద అతని శరీరం నుజ్జునుజ్జయి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి చిన్నప్పుడే తండ్రి శ్రీరాములు మృతి చెందగా, మతి స్థిమితం లేని తల్లి రాజులమ్మ, తమ్ముడు వెంకటేష్ ఉన్నట్లు పోలీసులు తెలిపారు. పూండి రైల్వేస్టేషన్ మాస్టార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పలాస జిఆర్‌పి ఎస్ఐ ఎస్కే షరీఫ్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. పలాస ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్గం నిర్వహించి మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

9 మందికి జరిమానా

పలాస: మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 9 మందికి గాను, ఒక్కొక్కరికీ రూ.పది వేలు చొప్పున స్థానిక జడ్జి జరిమానా విధించారని కాశీబుగ్గ సిఐ పి.సూర్యనారాయణ గురువారం తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులపై పోలీసులు, న్యాయమూర్తి కఠినంగా వ్యవహరిస్తున్నారన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే వారిపై చట్టపరంగా కేసులను నమోదు చేసి కోర్టుకు తరలిస్తున్నామని తెలిపారు.

దుకాణాలు వేలం పాట వేయాలి



మాట్లాడుతున్న ఇఒ వెంకటరమణ

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి పంచాయతీ సంబంధించిన దుకాణాలను అద్దీలు వసూలు చేసినందుకు వేలంపాట వేయాలని వార్డు సభ్యులు డిమాండ్ చేశారు. పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ గుండేలి సుజాత అధ్యక్షతన గురువారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వార్డు సభ్యులు పలు అంశాలపై నిలదీశారు. గత మూడేళ్లుగా వేలంపాట వేయకుండా వస్తున్నారని అన్నారు. మూడేళ్ల నుంచి దుకాణాలను ఏటా రెవెన్యూవల్ చేసుకుని వస్తున్నారని అన్నారు. జులై 15 లోగా వేటం పాట నిర్వహించాలని డిమాండ్ చేశారు. పాత జాతీయ రహదారి జగతిమెట్ట కూడలి నుంచి చేరివీధి ఫ్లైఓవర్ వరకు సెంట్రల్ లైటింగ్‌కు రూ.35 లక్షలు కాంట్రాక్టర్‌కు చెల్లించాలని ఇఒ జి.వెంకటరావు సభ్యులకు వివరించారు. దీనిని సభ్యులు తిరస్కరించారు. రూ.35 లక్షలకు ఎస్టిమేషన్ ఆమోదించకుండా బిల్లు ఎలా చెల్లిస్తామని సభ్యులు నిలదీశారు. సుమారు రూ.15 లక్షలతో కాలువలో మురుగు కల్వర్టు మరమ్మతు పనులకు చెల్లించాలని సభ్యుల దృష్టికి తీసుకొచ్చారు. ముందస్తు అమెదం లేకుండా చెల్లించలేమని సభ్యులు వాయిదా వేశారు. విద్యుత్ దీపాలు, పారిశుధ్యం, తాగునీరు ప్రజలకు సక్రమంగా అందజేయాలని ఇఒను కోరారు. సమావేశంలో వార్డు సభ్యులు సువ్వారి రాజేశ్వరరావు, దివ్వెల పోలయ్య, కంచరాణ సావిత్రి, తోట లోకేశ్వరరావు, నూనెల సోమేశ్వరరావు, రవి, బమ్మిడి గురువునాయడు పాల్గొన్నారు.

ఉద్యోగోన్నతులు కల్పించాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగులు

నందిగాం : గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు ఉద్యోగోన్నతులు కల్పించాలని, స్పష్టమైన జాబ్ ఛార్ట్ ఇచ్చి సర్వీస్ రూల్స్ అమలు చేయాలని కోరారు. ఈ మేరకు తహశీల్దార్ పి.సోమేశ్వరరావు, ఎంపిడిఒ కుమార్ పట్నాయక్‌లను గురువారం కలిసి వేర్వేరుగా వినతిపత్రాలను అందజేశారు. బదిలీల ప్రక్రియలో సినియారిటీ, మెరిట్ జాబితాలు విడుదల చేసి సజావుగా, పారదర్శకంగా నిర్వహించాలన్నారు. రావాల్సిన నోషనల్ ఇంక్రిమెంట్లు, పెండింగ్ ఎరియార్స్‌ను వెంటనే విడుదల చేయాలన్నారు.

వజ్రపుకొత్తూరు : గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు ఉద్యోగోన్నతులు కల్పించి అనంతరం బదిలీలు చేయాలని కోరారు. ఈ మేరకు మండల పరిషత్ కార్యాలయం వద్ద గురువారం ఆందోళనకు దిగారు. రెండు నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని, జిఒ నంబరు 5ను సవరించాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో షేక్ బాబుద్దీన్, సిహెచ్.హరీష్, పి.భువనేష్‌కుమార్ పాల్గొన్నారు.



శాంపిల్‌ను పరిశీలిస్తున్న ఆర్‌డిఒ వెంకటేష్

పెట్రోల్ బంకుల పరిశీలన

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ, మున్సిపాలిటీ, మండలంలోని వివిధ పెట్రోల్ బంకులను ఆర్‌డిఒ జి.వెంకటేష్ గురువారం పరిశీలించారు. ఆయల్ నిల్వలు, అమ్మకాలతో పాటు నాణ్యతను పరిశీలించారు. వాహనాలకు వేస్తున్న పెట్రోలు, డీజిల్ సక్రమంగా వేస్తున్నారో? లేదో? పరిశీలించారు. అనంతరం మీటర్‌రీడింగ్ ద్వారా పరిమాణం కొలిచారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెట్రోల్ బంకుల్లో నాణ్యతతో పాటు కొలతలు కూడా సక్రమంగా ఉండాలన్నారు. లేకుంటే అటువంటి వాటిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయనతో పాటు తహశీల్దార్ కళ్యాణచక్రవర్తి, డిప్యూటీ తహశీల్దార్ వాయిలపల్లి గిరి, ఆర్‌ఐలు కంచరాన ఖగేశ్వరరావు, ప్రసాదరావు రెవెన్యూ అధికారులు ఉన్నారు.



కిమ్స్‌లో స్కానింగ్ యంత్రాన్ని పరిశీలిస్తున్న డిఐఒ రామదాస్

స్కానింగ్ యంత్రం పరిశీలన

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

నగరంలోని కిమ్స్ ఆస్పత్రిలో గురువారం కొత్తగా స్కానింగ్ యంత్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ యంత్రాన్ని డిఐఒ రామదాస్ పరిశీలించారు. ఈ సందర్భంగా పలు విభాగాలు తనిఖీ చేశారు. ప్రభుత్వ నిబంధనలకు లోబడి ఆస్పత్రి నిర్వహించాలన్నారు. మెరుగైన వైద్య సేవలు ఉండాలని, రోగులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ఆయనతో పాటు అధికారులు ఉన్నారు.

డిజె బాక్సులను నిషేధించాలి



గణపతి

సోంపేట : శబ్ద కాలుష్యాన్ని కలగజేయడంతో పాటు వివిధ అనారోగ్యాలకు కారణమవుతున్న డిజె సౌండ్ బాక్సులను నిషేధించాలని, వివాహాది శుభ కార్యక్రమాల్లో సాధారణ సౌండ్ బాక్సులను వినియోగించేలా చర్యలు తీసుకోవాలని జాగృతి అధ్యక్షుడు రామ్ బుడ్డి గణపతి కోరారు. ఈ మేరకు రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌కు గురువారం లేఖ పంపించానని అన్నారు. ఊరేగింపుల్లో డిజె సౌండ్ వల్ల ఇళ్లల్లో ఉన్న వృద్ధులు, రోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. డిజె సౌండ్ లేకుండా సాధారణ బాక్సులు వినియోగించేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని, పాటించని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

బదిలీ తహశీల్దార్‌కు సన్మానం

లావేరు : లావేరు మండల తహశీల్దార్‌గా పనిచేసి ఇటీవల విజయనగరం జిల్లా రాజాం తహశీల్దార్‌గా బదిలీపై వెళ్లిన మంగం రాజశేఖర్‌ను లావేరు తహశీల్దార్ జివిఎల్ఎ శ్రీనువాసరావు ఆధ్వర్యంలో రెవెన్యూ ఉద్యోగులు గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బదిలీ తహశీల్దార్ రాజశేఖర్ మాట్లాడుతూ లావేరు మండలం ఉద్యోగులకు ఇక్కడ ఉద్యోగిగా పని చేయడం సంతోషాన్ని ఇచ్చిందని, ప్రజలంతా మంచి మనసున్న వారని తెలిపారు. తహశీల్దార్ శ్రీనువాసరావు మాట్లాడుతూ రాజశేఖర్ తక్కువ రోజులు పనిచేసినా ప్రజలు, ఉద్యోగుల మన్ననలు పొందారని, ఇటువంటి గౌరవం అందరికీ రాదని, బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించి సమస్యలు పరిష్కారం చేస్తే అటువంటి అధికారులను ప్రజలు ఎన్నటికీ గుర్తుపెట్టుకుంటారనడానికి రాజశేఖర్ నిదర్శనం అన్నారు. కార్యక్రమంలో డిటి డి శ్రీనువాసరావు, మండల సర్వేయర్ బి.శ్రీధర్ రెడ్డి, డిటి ఎం.తిరుపతిరావు, ఆర్‌ఐ రాపర్తి అప్పలరాజు, విఆర్‌ఒలు, సిబ్బంది పాల్గొన్నారు.



సన్మాన కార్యక్రమంలో మాట్లాడుతున్న రాజశేఖర్

పంచాయతీల అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి- పలాస



మాట్లాడుతున్న ఎంపిడిఒ వసంతకుమార్

మహిళా సర్పంచ్‌లు పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలని ఎంపిడిఒ వసంత కుమార్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఇచ్ఛాపురం నియోజకవర్గానికి చెందిన మహిళా సర్పంచ్‌లకు మహిళా సాధికారతో స్వపరిపాలన సాధ్యంపై గురువారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముందుగా ఇచ్ఛాపురం, అనంతరం పలాస నియోజకవర్గంలో ఉన్న మహిళా సర్పంచ్‌లకు మూడు రోజుల పాటు శిక్షణ ఇచ్చామని తెలిపారు. పంచాయతీలు పాలన ఏలా చేయాలి, ఎవరితో ఏలా మాట్లాడాలి, అభివృద్ధి ఎలా సాధించాలో మెలుకువలు తెలుసుకోవాలన్నారు. ప్రతి విషయాన్నీ అవగాహన చేసుకొని పాలన చేయాలని సూచించారు. ప్రభుత్వం మహిళలకు ప్రత్యేక స్థానం కల్పిస్తుందని, ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం డిఆర్‌పిలు జ్యోతి శ్రీనివాస్, కామరాజు, ఎన్.మన్మథరావులు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ మెట్ట వైకుంఠరావు, మండల విద్యాశాఖాధికారి సిహెచ్.శ్రీనివాసరావు, ఎఒ అనురాధ, సీనియర్ అసిస్టెంట్ మన్మథరావు, డిపిఆర్‌సి కో-ఆర్డినేటర్ పేరాడ ఆనందరావు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటి ఎఒకు డాక్టరేట్

ప్రజాశక్తి- ఎచ్చెర్ల



రామకృష్ణను అభినందిస్తున్న ప్రొఫెసర్ బాలాజీ తదితరులు

రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్, పరిపాలన అధికారిగా సేవలందిస్తున్న ముని రామకృష్ణ దేశంలో అత్యంత ప్రతిష్టాత్మక విద్యాసంస్థల్లో ఒకటైన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ తిరుపతి నుంచి డాక్టరేట్ పట్టా పొందారు. రామకృష్ణ ఈ పరిశోధనను ఇసిఇ విభాగంలో నెట్‌వర్క్ ఎకనామిక్స్ ఏరియాలో భాగస్వామ్య ఆధారిత సామాజిక అభ్యాస మార్కెట్లలో ధరల విధానాలు అనే అంశంపై డాక్టర్ కె.పి.నవీన్ పర్యవేక్షణలో పూర్తిచేశారు. ఈయన బిటెక్ ఆంధ్రా విశ్వ విద్యాలయంలో, ఎంటెక్ ఐఐటి ఖరగ్‌పూర్‌లో పూర్తి చేశారు. రిజిస్టర్ డాక్టర్ సండ్ర అమరేంద్ర కుమార్, డైరెక్టర్ ప్రొఫెసర్ కెవిడిజి బాలాజీ, అకడమిక్ డీన్ శివ రామకృష్ణ, ఫైనాన్స్ ఆఫీసర్ వాసు, మోహన్ కృష్ణ చౌదరి, డీన్ వెల్ఫేర్ రవి, డిప్యూటీ ఎఒ డాక్టర్ గణేష్ మళ్ళ, అధికారులు, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది అభినంధనులు తెలిపారు.

సహకారం అవసరం

నందిగాం : ప్రభుత్వ రంగ సంస్థల అభివృద్ధిలో గ్రామస్తులు, దాతల సహకారం, భాగస్వామ్యం అవసరమని నర్సిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు చెల్లి వెంకటరమణ అన్నారు. భావనపాడుకు చెందిన ఎఎస్ఐ చమళ్ల చిట్టిబాబు, సిహెచ్.గోవిందరాజులు సౌజన్యంతో గురువారం పాఠశాల ఆవరణలో 150 మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పాఠశాలల అభివృద్ధికి ప్రజా సహకారం అవసరమని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బొడ్డేపల్లి శేషగిరి, రామముని రమేష్‌కుమార్, అమీన్, దీప పాల్గొన్నారు.

నట్టల నివారణ మందుల పంపిణీ

పోలాకి : మండలంలోని మబగాంలో గొర్రెలకు, మేకలకు నట్టల నివారణా మందులను ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి వేశారు. కార్యక్రమంలో నీటి సంఘం అధ్యక్షులు ధర్మాన అమ్మన్నాయుడు, నాయకులు కాయ రవి, మెండ రమేష్, పశువైద్యాధికారులు పద్మప్రియ, మల్లేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

పాతపట్నం: మండలంలోని పాపత్పట,ం పెదలోగిడిలో గొర్రెలకు, మేకలకు నట్టల నివారణా మందులను ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ మంచు కరుణాకరావు వేశారు. కార్యక్రమంలో సంచార పశువైద్యశాల డాక్టర్ కిరణ్, సిబ్బంది కుమారి, నిరంజన్, మోహన్, నారాయణ పాల్గొన్నారు.

ట్రాక్టర్ ప్రారంభం

ఇచ్ఛాపురం: మండలంలోని కేసుపురం పంచాయతీలో చెత్త సేకరణ ట్రాక్టర్‌ను మాజీ ఎంపిపి దక్కత ఢిల్లీరావు గురువారం ప్రారంభించారు. కేసుపురం, సన్యాసిపుట్టుగ, నీలాపుపుట్టుగ ప్రజల నుంచి సేకరించిన చెత్తా చెదారాలను ట్రాక్టర్ ద్వారా చెత్త సంపదకు ట్రాక్టర్‌లో పారిశుధ్య కార్మికులు తరలిస్తారని తెలిపారు. కార్యక్రమం సర్పంచ్ గుజ్జి ఢిల్లీరావు, కార్యదర్శి సంతోష్‌కుమార్, నీటి సంఘం అధ్యక్షుడు దక్కత కామేశ్వరరావు, విఆర్‌ఒ దున్న శంకరరావు, డి.గోపి పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందజేస్తున్న కార్యకర్త

మృతుని కుటుంబానికి ఆర్థికసాయం

పొందూరు: మండలంలోని పుల్లాజీపేటకు చెందిన కొంచాడ రమణ అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన కుటుంబానికి స్థానిక ఎమ్మెల్యే కూన రవికుమార్ రూ.20 వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఇటీవల రమణ మృతి చెందిన విషయం ఎమ్మెల్యే దృష్టికి రావడంతో వెంటనే స్పందించిన ఆయన విజయవాడలో ఉన్నప్పటికీ రూ.20 వేలు అందజేయాలని పార్టీ కార్యకర్తలకు ఆదేశించారు. దీంతో గురువారం ఎమ్మెల్యే ఆదేశాల మేరకు కార్యకర్తలు ఆ మొత్తాన్ని మృతుని కుటుంబ సభ్యులకు అందజేశారు. దీంతో మృతుని కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

నవధాన్యాల విధానంతో అధిక దిగుబడి

ప్రజాశక్తి- నౌపడ



అవగాహన కల్పిస్తున్న ఎఒ గోపాలరావు

తొలకరిలో సాగు చేసే వరి పంటకు వెద పద్ధతిలో ఎకరానికి రెండు కిలోల వంతున నవధాన్యాలను వరి విత్తనాలతో కలిపి వేస్తే అధిక దిగుబడి సాధించవచ్చని ఎఒ రాళ్లపేట అప్పారావు సూచించారు. సంతబొమ్మాళి మండలంలోని ఎర్నాగులపేటలో బుధవారం నిర్వహించిన పొలం పిలిస్తోంది కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా ప్రోత్సహిస్తున్న ప్రకృతి వ్యవసాయ విధానాల్లోకెల్లా నవధాన్యాల సాగు రాబోవు రోజుల్లో కీలక భూమిక పోషించబోతోందని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకుడు బాలక సాయికిశోర్, ప్రకృతి వ్యవసాయ విభాగం ప్రతినిధులు తంగి విజయమ్మ, కింజరాపు ఉష, వేణమ్మ, అభ్యుదయ రైతులు సెవ్వాన ప్రసాదరావు రైతులు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నాగేశ్వరరావు

నూతన పుస్తకావిష్కరణ

టెక్కలి రూరల్ : టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాల అధ్యాపక బృందం, డాక్టర్ కె వేణుగోపాల్ అసోసియేట్ ఆర్‌అండ్‌డి డాక్టర్ జి.సతీష్‌కుమార్, డీన్ ఐఐసిడి డాక్టర్ డి.శ్రీరాములు, డీన్ ఆర్‌అండ్‌డి ది మోడర్న్ గైడ్ టు ఎంట్రీ పేన్యూర్‌షిప్ స్టార్టప్స్ అండ్ ఐపిఆర్ అనే రచించిన పుస్తకాన్ని రచించారు. దీనిని కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ పుస్తకం విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానం వ్యాపారాభివృద్ధికి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



మైక్‌లో అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి- ఆమదాలవలస

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యతని ఇఒపిఆర్‌డి గోపాలరావు అన్నారు. గురువారం మండలంలోని కొర్లకోటలో గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్య కార్యక్రమాల అమలు తీరుపై గ్రామీణాభివృద్ధి శాఖ నిర్వహిస్తున్న ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టం (ఐవిఆర్‌ఎస్) ఫోన్‌కాల్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గోపాలరావు మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. తడి, పొడి చెత్తలను వేరుచేసి గ్రీన్ అంబాసిడర్లకు అందజేసి గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. గ్రామంలో ఇంటింటికి వెళ్లి పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రిసోర్స్ కో-ఆర్డినేటర్ చల్ల కామేశ్వరరావు, కార్యదర్శి హరీష్, గ్రీన్ గార్డ్ రాజారావు తదితరులు పాల్గొన్నారు.



నగదును అందజేస్తున్న రామరాజు

విద్యార్థులకు నగదు పురస్కారం

కొత్తూరు : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గణపతి ధనుంజయరావు అధ్యక్షతన పాతపట్నానికి చెందిన రామరాజు ఛారిటబుల్ ట్రస్టు అధ్యక్షులు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పారశెల్లి రామరాజు విద్యార్థులకు గురువారం రామరాజు విద్యా పురస్కారాలు, నగదు అందజేశారు. కరక అక్షయ, కొమనాపల్లి సరిత, బంతు ఝాన్సీ, గొర్లి జ్ఞానేశ్వరి, కోడూరి శ్రీహరిలకు సన్మానించి పురస్కారాలను అందజేశారు. కార్యక్రమంలో పూర్వ ప్రిన్సిపాల్ బండారు రవికుమార్, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు ఎద్దు గోపాల్‌దాస్ నాయుడు, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఎ.గోవిందరావు పాల్గొన్నారు.

నాయకుల పరామర్శ



పరామర్శిస్తున్న జెడ్‌పిటిసి యశోద

సోంపేట : మండలంలోని మామిడిపల్లికి చెందిన న్యాయవాది గోరకల లింగరాజు తండ్రి కేశవరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న జెడ్‌పిటిసి తడక యశోద, పలాసపురం సర్పంచ్ తడక జోగారావు గురువారం లింగరాజు కుటుంబ సభ్యులను పరామర్శించారు. సందర్భంగా తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

ఎంపిపి నిమ్మన దాసు లింగరాజు కుటుంబ సభ్యులను కలిసి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈయనతో పాటు సర్పంచ్ పాతిరి శేషగిరి, శిలగాన భాస్కరరావు, కె.శ్రీనివాసరావు, మాధవరావు, నాని, కేశవరావు ఉన్నారు.

పరిశ్రమల అభివృద్ధికి ప్రోత్సాహం



మాట్లాడుతున్న రవికుమార్

నరసన్నపేట: సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధికి ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం లభిస్తుందని ఎపి ఫైనాన్స్ కార్పొరేషన్ బ్రాంచ్ మేనేజర్ జి.రవికుమార్ అన్నారు. నరసన్నపేట సత్యనారాయణ కళ్యాణ మండపంలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు గురువారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వివిధ పరిశ్రమలకు ఏయే విధాలుగా ప్రోత్సాహం లభిస్తుంది, అలాగే పరిశ్రమల ఏర్పాటు, వాటి అభివృద్ధికి అనుసరించి వెలిసిన మార్గాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పి.వి.రామనాద్, రోహిత్ కుమార్, హరిక, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సిఎం సహాయనిధి చెక్కులు అందజేత

బూర్జ : మండలం పెద్దపేట పంచాయతీ మదనాపురానికి చెందిన రాజేంద్ర పాడి ఇటీవల మృతి చెందడంతో ఆయన కుటుంబానికి సాయం అందించేందుకు కూన రవికుమార్ చొరవతో సిఎం రిలీఫ్ ఫండ్ (సిఎంఆర్‌ఎఫ్) ద్వారా రూ.4,14 వేలు చెక్కును గురువారం మదనాపురం గ్రామంలో మాజీ ఎంపిపి కూన ప్రమీల, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ ఆనెపు రామకృష్ణ నాయుడు సమక్షంలో రాజేంద్ర పాడి కుటుంబ సభ్యులకు అందజేశారు. అలాగే అయ్యవారిపేటకు చెందిన మామిడి ఆదిలక్ష్మి అనారోగ్యం పాలవ్వగా రూ.58 వేల 650, కీర్తి లావణ్యకు రూ.78 వేలు 150 సిఎం రిలీఫ్ ఫండ్ ద్వారా అందజేశారు. అప్పలపేట సర్పంచ్ కొరికాన వెంకట సీతారామరాజు, వావిలపల్లి ఆదినారాయణ, మజ్జి అప్పలనాయుడు, దూబ బాలకృష్ణ, దాశరెడ్డి మౌళి, దేవాడ శ్రీను తదితర కూటమి నాయకులు పాల్గొన్నారు.